క్లుప్తంగా

నేడు మంత్రి పర్యటన

నగరి: విజయపురం మండలం కాళికాపురం సచివాలయ పరిధిలో సోమవారం సాయంత్రం పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారు. కాళికాపురం, బీసీకాలనీ, దళితవాడ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పథకాల లబ్ధి, సమస్యలను తెలుసుకుంటారని మంత్రి కార్యాలయం ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

నేడు సచివాలయాల్లో స్పందన

గంగాధరనెల్లూరు: మండలంలోని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన నిర్వహించాలని ఎంపీడీఓ శ్రీదేవి తెలిపారు. సిబ్బంది అందుబాటులో ఉంటూ అర్జీలను స్వీకరించాలన్నారు. సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే ఉన్నతాధికారులకు నివేదిక పంపాలన్నారు.

ఓం శక్తి ఆలయంలో మాంగల్య పూజలు



పాలసముద్రం: మండలంలోని శ్రీకావేరిరాజుపురం గ్రామంలో వెలసిన ఓం శక్తి ఆలయంలో ఆదివారం మాంగల్య పూజలు వైభవంగా జరిగాయి. ఉదయం అమ్మవారిని పాలు, పెరుగు, చందనం, తేనె, నెయ్యితో అభిషేకాలు చేశారు. సాయంత్రం అమ్మవారిని ఓం శక్తి మాల ధరించిన మహిళలు మాంగల్య పూజకు అవసరమైన సామగ్రిని మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించిన అనంతరం గురుస్వామి నాగమ్మ ఆధ్వర్యంలో మాంగల్య పూజ జరిగింది.

130 మందికి వైద్య చికిత్సలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

వెదురుకుప్పం: మండలంలోని పాతగుంటలో ధన్వంతరి హెల్త్ అండ్ కేర్ సొసైటీ ఆధ్వర్యంలో చిత్తూరు ఆర్వీఎస్ హాస్పిటల్ వారి సహకారంతో ధాక్స్ సంస్థ ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించింది. శిబిరంలో 130 మందికి వైద్య సేవలు అందించినట్లు ధాక్స్ అధ్యక్షుడు రామచంద్ర భూపతి తెలిపారు. 12 మందిని శస్త్ర చికిత్స నిమిత్తం సిఫార్సు చేసినట్లు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలన్న సంకల్పంతో ప్రతి నెలా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సంస్థ సభ్యులు మోహన్‌బాబు, జ్యోతీష్‌కుమార్, చందు, జ్యోతీశ్వర్, లత, ఉష, పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



పాలసముద్రం: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని, శుభ్రతతో రోగాలు దూరమవుతాయని సర్పంచ్ అనురేఖ తెలిపారు. ఆదివారం ఆముదాల గ్రామ సచివాలయ ఆవరణంలో వలంటీర్లు, ఆరోగ్య సిబ్బందికి పంచాయతీ కార్యదర్శి యశ్వంత్ ఆధ్వర్యంలో జగనన్న స్వచ్ఛ సంకల్పంపై అవగాహన కార్యక్రమం జరిగింది. సర్పంచ్ మాట్లాడుతూ జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ప్రతి పల్లెను పరిశుభ్ర గ్రామాలుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

ఘనంగా ఇరుముడి ఉత్సవాలు



త్రిశూలానికి అమ్మవారి అలంకరణ

నగరి: పట్టణంలోని మేల్‌మరువత్తూర్ ఆదిపరాశక్తి ఆలయంలో ఆదివారం ఇరుముడి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్రిశూలానికి అమ్మవారి అలంకరణ చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కుంకుమార్చన పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. నగరి పరిసర ప్రాంతానికి భక్తులు పెద్దసంఖ్యలో ఇరుముడులు ధరించారు.

నగరి రైల్వేస్టేషన్‌కు మహర్దశ

- రూ.8 కోట్లతో అభివృద్ధి
- అండర్ బ్రిడ్జి, ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు
- మంత్రి రోజా చొరవతో సకల వసతులు



గతంలో రైల్వేస్టేషన్ (ఫైల్)



ఓవర్ బ్రిడ్జితో ఆధునికీకరించిన నగరి రైల్వేస్టేషన్



నూతనంగా నిర్మించిన అండర్ బ్రిడ్జి



నగరి: ఒకప్పుడు స్టేషన్ మాస్టర్ గది మినహా ఎలాంటి సదుపాయాలు లేని నగరి రైల్వేస్టేషన్ నేడు రూపురేఖలు మారిపోయాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నాటి ఎమ్మెల్యే, నేటి మంత్రి ఆర్కేరోజా పార్టీ ఎంపీలతో కలిసి 2020 ఫిబ్రవరిలో అప్పటి కేంద్ర రైల్వే మంత్రి పియూష్‌గోయల్‌ను కలిసి రైల్వేస్టేషన్ అభివృద్ధిపై వినతి పత్రం అందజేశారు. దీంతో రైల్వేస్టేషన్‌కు మహర్దశ పట్టింది. రూ.5 కోట్లతో అండర్ బ్రిడ్జి, రూ.1.05 కోట్లతో ఫుట్ ఓవర్ పాత్, రూ.75 లక్షలతో ప్లాట్ ఫాం, ప్రయాణికులు కూర్చునే సిమెంటు కుర్చీలు, రూ.25 లక్షలతో ఎల్ఈడీ లైట్లు, రూ.20 లక్షలతో పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టం, రూ.20 లక్షలతో పే అండ్ యూజ్ మరుగుదొడ్లు, రూ.15 లక్షలతో సర్క్యులేటింగ్ ఏరియా అభివృద్ధి, రూ.15 లక్షలతో వెయిటింగ్ హాల్ నిర్మించారు. త్వరలో నాలుగో ప్లాట్ ఫాం పనులు ప్రారంభంకానున్నాయి.

నగరి – దిండివనం లైన్ పూర్తయి ఉంటే..

2006–07 బడ్జెట్‌లో ప్రతిపాదించిన నగరి–దిండివనం రైల్వేలైన్ పూర్తయి ఉంటే నగరి రైల్వేస్టేషన్ జంక్షన్‌గా మారేది. భూముల కేటాయింపులో జాప్యం, నిధుల విడుదల కాకపోవడం లాంటి పలు సమస్యలతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ మార్గం నగరి నుంచి చిత్తూరు, వేలూరు, తిరువళ్లూరు, తిరువణ్ణామలై జిల్లాలను కలుపుతూ 184 కిలోమీటర్లు ప్రయాణించి దిండివనం చేరుతుంది. 22 స్టేషన్లు, 3 జంక్షన్లు,13 క్రాసింగ్‌లు, 9 హాల్టులను కలుపుతుంది. రూ.582 కోట్లు కేటాయించిన ఈ ప్రాజెక్టు అంచనాల ప్రకారం 2020కే పూర్తవ్వాలి. రైల్వే లైన్‌కు భూములకు కేటాయింపు పనులు మన రాష్ట్రంలో పూర్తయ్యాయి. తమిళనాడు రాష్ట్రానికి సంబంధించి భూ సమస్యలు పరిష్కారం కావలసి ఉంది. అలాగే నిధుల విడుదల కాకపోవడంతో పనులు ప్రాథమిక దశలోనే ఉన్నాయి. ఇప్పటి వరకు 6 కిలోమీటర్ల మేరకే రైల్వేలైన్ పూర్తయింది. పనులు వేగవంతంపై పార్లమెంట్‌లో చర్చలు జరుగుతున్నాయి. అవి ఫలించి లైన్ పూర్తయితే నగరి రైల్వేస్టేషన్ జంక్షన్‌గా రూపుదిద్దుకుంటుంది. నగరి ప్రాంతంలో ఆగే రైళ్ల సంఖ్య కూడా పెరుగుతుంది.

క్రికెట్ విజేత తాటిమాకులపల్లె జట్టు



విజేత జట్ల క్రీడాకారులతో ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

పెనుమూరు(కార్వేటినగరం): మండలంలోని తాటిమాకులపల్లెలో జరిగిన నాలుగు రోజుల క్రికెట్ టోర్నమెంట్ విజేతగా తాటిమాకులపల్లె జట్టు, రన్నరప్‌గా బి.అగ్రహారం జట్టు నిలిచాయి. ఆదివారం ఫైనల్స్ జరిగాయి. బహుమతుల ప్రదాన కార్యక్రమానికి ఏఎంసీ చైర్మన్ బండికమలాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు విజయకుమార్‌రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. వారు మాట్లాడుతూ టోర్నమెంట్లు గ్రామీణ క్రీడాకారుల్లో ఐక్యతను పెంపొందింపజేస్తుందని తెలిపారు. తమ ప్రతిభ బయట పడాలంటే క్రీడాకారులు టోర్నమెంట్లలో పాల్గొనాలని పేర్కొన్నారు. అనంతరం విన్నర్స్ జట్టుకు రూ.10.116, రన్నర్స్ జట్టుకు రూ.5116 బహుమతిగా అందించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు హరి రూ.3000, లక్ష్మీపతి రూ.3వేలు టోర్నమెంట్ నిర్వాహకులకు అందించారు. వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉప ముఖ్యమంత్రి పర్యటన

కార్వేటినగరం: మండలంలో సోమవారం ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పర్యటించనున్నారని ఎంపీపీ లత తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు ఇందిరా కాలనీలో కొత్తగా నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తారని చెప్పారు. 9.30 గంటలకు ఆర్‌కేవీబీ పేటలో పుష్కరిణి నిర్మాణానికి భూమి పూజ, 10.30 గంటలకు అదే గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకు ప్రారంభం, 11 గంటలకు రాజులకండ్రిగ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకు, మధ్యాహ్నం 12 గంటలకు ఎంఎం విలాసంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం, మధ్యాహ్నం ఒంటి గంటకు మునిరెడ్డి కండ్రిగ దళితవాడలో వాటర్ ట్యాంకు, 2 గంటలకు జీలవారి కండ్రిగలో వాటర్ ప్లాంట్‌ను ఉప ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని వివరించారు. అనంతరం జీలవారి కండ్రిగలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

మురుగు నీటి తరలింపు



పుత్తూరు రూరల్: మున్సిపల్ పరిధి 21వ వార్డు చినరాజుకుప్పం సర్వీసు రోడ్డుపైకి వస్తున్న మురుగునీటిని ఆదివారం ట్యాంకుల ద్వారా తరలించారు. ఫలితంగా గ్రామస్తుల సమస్య పరిష్కారమైంది. గ్రామ సమీపంలోని వెంకటపెరుమాల్ ఇంజినీరింగ్ కళాశాల నుంచి వెలువడుతున్న మురుగు నీటిని కళాశాల యాజమాన్యమే తరలించినట్లు మున్సిపల్ చైర్మన్ ఏ.హరి తెలిపారు. మంత్రి ఆర్కే రోజా ఆదేశాల మేరకు కళాశాల యాజమాన్యం గ్రామస్తులకు ఇబ్బంది లేకుండా పారిశుద్ధ్య పనులను చేపట్టిందని చెప్పారు. మంత్రి ఆదేశాల మేరకు ఆర్అండ్‌బీ శాఖ వారు భవిషత్‌లో నీరు నిల్వ లేకుండా పైపులైన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమాన్ని వార్డు కౌన్సిలర్ చిట్టిబాబు, నాయకుడు జనార్దన్ యాదవ్ పర్యవేక్షించారు.

వైభవంగా మండల పూజలు





ప్రత్యేక అలంకరణలో అమ్మవారు, హోమ పూజలు

నగరి: మండలంలోని మూలనత్తం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీకాశీవిశాలక్ష్మి సమేత విశ్వేశ్వర, గంగయమ్మ, పొన్నియమ్మ, ఏల్లయమ్మ, పరియ పాళయత్తు అమ్మ ఆలయంలో ఆదివారం మండల పూజలు వైభవంగా జరిగాయి. ప్రత్యేక హోమపూజలు నిర్వహించారు. దేవతలకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు జరిగాయి. దేవతల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆలయ నిర్వాహకులు మూలనత్తమయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువు పద్మనాభనాయుడును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

పెనుమూరు(కార్వేటినగరం): పెనుమూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1994–95వ సంవత్సరం 10వ తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఎక్కడెక్కడో దూరప్రాంతాల్లో స్థిరపడిన వారంతా వాట్సాప్ ఆహ్వానంతో ఒక్కటయ్యారు. ఆప్యాయంగా పలకరించు కుంటూ ఆనాటి మధురస్మృతులను నెమరేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయుడు పద్మనాభ నాయుడుని ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు తులసిరామనాయుడు, కిషోర్‌నాయుడు, శ్రీనాథ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానవనంలో సరదా సరదాగా..

- పిల్లలు..పెద్దలతో కోలాహలంగా..
- విద్యుత్ దీప కాంతులీనుతున్న పార్కు
- పుత్తూరులో సండే సండడే సండడి



ఆట పరికరాలతో పిల్లల కోలాహలం

గతంలో ఎన్నడూ లేని విధంగా పుత్తూరు పట్టణ ప్రజలు సండే సరదాలను తీర్చుకొంటున్నారు. ఇందుకు వేదిక పట్టణంలో ఏర్పాటైన ఉద్యానవనం. ఎన్నో ఏళ్ల నిరీక్షణ తర్వాత పర్యాటక శాఖా మంత్రి ఆర్కే రోజా చొరవతో పుత్తూరులో రూ.1.05 కోట్ల నిధులతో పార్కు ఏర్పాటైంది. స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు సైతం ఇక్కడికి వచ్చి సరదాగా గడుపుతున్నారు. యువకులు జిమ్ చేస్తుండగా, మరి కొందరు వాకింగ్ ట్రాక్‌పై నడుస్తూ చల్లటి గాలిని ఆస్వాదిస్తున్నారు.



పార్కులో కుటుంబ సమేతంగా..



జిమ్‌లో జోరుగా హుషారుగా..

పుత్తూరు రూరల్: పుత్తూరు పట్టణంలోని మున్సిపల్ పార్కు ఆహ్లాదానికి చిరునామాగా నిలుస్తోంది. ప్రతిరోజూ కన్నా భిన్నంగా ఆదివారం పిల్లలతో కలిసి పెద్దలు రావడంతో పార్కు కోలాహలంగా ఉంటోంది. నాలుగు రోజుల కిందటే రూ.8 లక్షల వ్యయంతో నూతనంగా 16 ఐమాక్స్ లైట్స్‌ను మంత్రి రోజా ప్రారంభించారు. దీంతో కొత్త వెలుగుల్లో పార్కు వెలిగిపోతోంది. మరింతగా పిల్లలను, పెద్దలను ఆకర్షిస్తోంది. ఫలితంగా పెద్దలు పచ్చని మొక్కల మధ్యన సేద తీరుతుండగా, పిల్లల ఆనందానికి హద్దే లేకుండి. తమ కోసమే ఏర్పాటు చేసిన ఆట వస్తువులతో ఆడుతూ పాడుతూ సరదా సరదాగా గడుపుతున్నారు. ఈ దృశ్యం చూడ ముచ్చటగా ఉంటోంది.

మంత్రి ఆర్కే రోజా చొరవతో..

తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (తుడా) పరిధిలోని పుత్తూరు ప్రజల సౌకర్యార్థం తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో ఎమ్మెల్యే రోజా చర్చించి పార్కుకు రూ.1.05 కోట్లు నిధులు మంజూరు చేయించారు. అప్పటి మున్సిపల్ కమిషనర్ కె.వెంకట్రామిరెడ్డి పర్యవేక్షణలో స్థానిక మార్కెట్ యార్డ్ సమీపంలోని 1.80 ఎకరాల సువిశాల ప్రదేశంలో అన్ని హంగులతో పార్కు పనులు పూర్తయ్యాయి. గత ఏడాది మార్చి 18న మంత్రి ఆర్కే రోజా చేతుల మీదుగా పార్కు ఆవిష్కృతమైంది.

పచ్చని చెట్లు..స్వచ్ఛమైన గాలి

పార్కు అందుబాటులోకి రావడంతో విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులు పచ్చని చెట్ల మధ్య ప్రశాంత వాతావరణంలో స్వచ్ఛమైన గాలిని పీలుస్తూ సేదతీరుతున్నారు. సెలవు రోజుల్లో పిల్లలు, పెద్దలు పార్కులోని ఆట వస్తువులతో కేరింతలు కొడుతున్నారు. యువకులు జిమ్‌తో సాధనలు చేస్తున్నారు, యువకులు, వృద్ధులు వాకింగ్ చేస్తూ ఆరోగ్యాన్ని పెంపొందించుకుంటున్నారు. అందరికీ అన్ని విధాలుగా ఎంతో హాయిని, ఆహ్లాదాన్ని ఇచ్చే ఉద్యానవనం అందుబాటులోకి రావడంతో పాటు ఎప్పటికప్పుడు సౌకర్యాలు మెరుగుపరుస్తుండడంపై పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక శ్రద్ధ తీసుకొంటున్నాం



పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా చొరవతో ఏర్పాటైన పార్కు నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. పుత్తూరు ప్రజల దశాబ్దాల కలకు ప్రతిరూపమైన పార్కు పర్యవేక్షణ పట్ల మంత్రి ఎప్పటికప్పుడు సూచనలిస్తున్నారు. ఆమె ఆదేశాల మేరకు పార్కులో త్వరలోనే టాయిలెట్స్, మరిన్ని వసతులు కల్పించనున్నాం.

–కెఎల్ఎన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, పుత్తూరు

మామిడికి మంచు, తెగుళ్ల దెబ్బ



మామిడి తోటను కప్పేసిన పొగ మంచు

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో విపరీతమైన మంచు, పచ్చ పురుగు, ఆకుముడత తెగులు మామిడి పంటపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వచ్చిన పూతను పచ్చపురుగు తినేస్తుండడంతో మామిడి రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. గతేడాది తక్కువ దిగుబడి దెబ్బ నుంచి కోలుకుందామని ఆశిస్తున్న రైతులు పంట రక్షణ చర్యలను ప్రారంభించారు.



తెగుళ్ల నివారణకు మందులు పిచికారీ



తిరుమలరాజాపురం మామిడి తోటల్లో విరబూసిన పూత

పాలసముద్రం : గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో సుమారు 10 వేల ఎకరాల విస్తీర్ణంలో మామిడి తోటలున్నాయి. పాలసముద్రం మండలంలో ఆముదాల, బాలకృష్ణాపురం, వనదుర్గాపురం, గంగమ్మంబపురం, కేజేపురం, వెంగళరాజుపురం, తిరుమలరాజుపురం, శ్రీకావేరిరాజుపురం పంచాయతీల్లో మామిడి తోటలు విస్తారంగా ఉన్నాయి. డిసెంబర్ నుంచి పూత విరబూస్తోంది. ఈ సమయంలో పచ్చపురుగు, ఆకుముడత తెగులు ఆశించడంతో పూత వచ్చినట్టే పోతుంది. పచ్చరంగు పురుగులు పూతను తినేస్తున్నాయి. పూతను కాపాడుకునేందుకు రైతులు అనేక కష్టాలు పడుతు మందులు పిచికారీ చేస్తున్నారు. మంచు అధికంగా పడుతుండడంతో మామిడి పూత పింజ కాకుండా రాలిపోతోంది. మంచు పడే సమయంలో పూతను నాశనం చేసే పురుగుల దాడి ఎక్కువగా ఉంటుంది. సకాలంలో చర్యలు తీసుకోకపోతే మామిడి పంట పూర్తిగా నాశనం అవుతుందని, మామిడిని తెగుళ్లు ఆశిస్తున్నా సస్యరక్షణ చర్యలపై ఉద్యానవన శాఖాధికారు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని రైతులు పేర్కొంటున్నారు. ఏం మందులు వాడాలో తెలియక ఎరువుల వ్యాపారులు సూచించిన మందులు పిచికారీ చేస్తున్నామని చెబుతున్నారు.

జల్లికట్టు, కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏఎస్ఐ మురుగేష్

పాలసముద్రం: సంక్రాంతి వేడుకల్లో భాగంగా మండలంలో ఎక్కడైనా జల్లికట్టు, పేకాట, కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఏఎస్ఐ మురుగేష్ హెచ్చరించారు. ఆదివారం బాలకృష్ణాపురం, ఆముదాల, రంగాపురం గ్రామాల్లో ఆయన పర్యటించారు. గ్రామస్తులతో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి వేడుకలను ప్రశాంత వాతారణంలో జరుపుకోవాలన్నారు. జల్లికట్టు, పేకాట, కోడిపందేలు వంటివి నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఎక్కడైనా ఇలాంటి కార్యాక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ముఖ్యంగా మద్యం తాగి గ్రామాల్లో గొడవలు జరిగే విధంగా ఎవ్వరూ ప్రవర్తించకూడదని తెలిపారు. అనుమతి లేకుండా గ్రూప్ డ్యాన్స్ వంటివి నిర్వహించకూడదని హెచ్చరించారు. గ్రామ పెద్దలు అరుల్, అదివాసన్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా సమస్యలను పరిష్కరించు కోవాలి



కాలెండర్లను ఆవిష్కరిస్తున్న విశ్వకర్మ మహాసభ నాయకులు

శ్రీరంగరాజపురం: విశ్వబ్రాహ్మణులు ఐక్యంగా ఉంటూ సమస్యల సాధనకు కృషి చేయాలని అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం స్థానిక మహాసభ కార్యాలయంలో 2023 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శతాబ్దాలుగా సంప్రదాయ విశ్వకర్మ వృత్తి పనులు చేస్తున్న వారికి ప్రభుత్వం సాయం అందించాలని, యంత్ర పరికరాలు రాయితీతో అందించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు సుధాకర్ ఆచారి, జిల్లా కార్యదర్శి కుప్పయ్య, ఉపాధ్యక్షులు లక్ష్మయ్య ఆచారి, మునిరత్నం, సురేష్,దాము పాల్గొన్నారు.

చిట్టిబాబు నోరు అదుపులో పెట్టుకో...

పాలసముద్రం: టీడీపీ గంగాధరనెల్లురు నియోజకవర్గ ఇన్‌చార్జి చిట్టిబాబు నాయుడు నోరు అదుపులో పెట్టుకోని మాట్లాడాలని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాళప్ప హెచ్చరించారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామిపై చిట్టిబాబు చేసిన విమర్శలను ఆయన ఖండించారు. ఆదివారం శ్రీరంగరాజపురంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధికంగా నిధులు పొందిన రెండవ నియోజకవర్గం గంగాధరనెల్లూరు అని, గతంలో ఎన్నడు లేని విధంగా అభివృద్ధి పనుల్లో నియోజకవర్గం దూసుకెళుతోందని తెలిపారు. మారుమూల ప్రాంతాలకు రోడ్లు వేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. నియోజకవర్గంలో 3 పురాతన ఆలయాలను టీటీడీలోకి విలీనం చేసి, కల్యాణ మండపం, ఆలయం లేని గ్రామాలకు టీటీడీ సహకారంతో రూ.10 లక్షలు మంజూరు చేసి అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రూ.197 కోట్లతో ఎన్టీఆర్ జలాశయం, రూ.27 కోట్లతో కుశస్థల నదిపై ఫ్లైఓవర్, 218 ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు మంజూరు, 6 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగకల్పనే ధ్యేయంగా స్మార్ట్ డీపీ పరిశ్రమ డిప్యూటీ సీఎం నారాయణస్వామి చొరవతో నెలకొల్పుతున్నారని పేర్కొన్నారు. తయ్యూరు సర్పంచ్ వరదమ్మ, నాయకులు మణి, దేవణమ్మ, ప్రకాష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ముతాలం రోడ్డుకు మరమ్మతులు



పనులను పరిశీలిస్తున్న నాయకులు

వెదురుకుప్పం: మండలంలోని ముతాలం రోడ్డు మరమ్మతులు వేగంగా సాగుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకి రోడ్డు అధ్వానంగా మారింది. స్పందించిన ఎంపీపీ నాగరాణి వెంటనే ముతాలం నుంచి కురివికుప్పం గ్రామం వరకు రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభించారు. ఆదివారం పనులను వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్ రెడ్డి, చిన్నబ్బరెడ్డి, రవీంద్రరెడ్డి, మనోహర్‌రెడ్డి పరిశీలించారు. వారు మాట్లాడుతూ సంక్రాంతి, మహా శివరాత్రి పండుగలను దృష్టిలో ఉంచుకుని గ్రావెల్ తోలి రోడ్డు మరమ్మతులు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వైకుంఠ ద్వార దర్శనానికి కాకవేడు వాసులు

నగరి: మున్సిపల్ పరిధి కాకవేడ ఆదిఆంధ్రవాడకు చెందిన 40 మందిని సమరత సేవా ఫౌండేషన్ వారు ఆదివారం తిరుమల వైకుంఠ ద్వార దర్శనానికి తీసుకెళ్లారు. మంత్రి ఆర్కేరోజా సోదరుడు, వైఎస్సార్ సీపీ నేత రామ్‌ప్రసాద్ రెడ్డి జెండా ఊపగా బస్సు తిరుమలకు బయలుదేరింది. భక్తుల గోవింద నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. నాయకులు మునికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నీవు లేవు.. నీ పాట అజరామరం

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు
- ఘనంగా ఘంటసాల శతజయంతి ఉత్సవాలు

చిత్తూరు రూరల్: మూడు దశాబ్దాల పాటు దక్షిణాది రాష్ట్రాల సంగీత ప్రియులను తన గాన మాధుర్యంలో ఓలలాడించిన గాన గంధర్వుడు ఘంటసాల అని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి అన్నారు. చిత్తూరు నగరం టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం ఘంటసాల అభిమానుల సంఘం, బలిజ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తొలుత కొందరు గాయకులు ఘంటసాల పాటలను ఆలపించి అలరించారు. అనంతరం ఆయన గీతాలకు నాట్యకారులు అద్భుతమైన నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ స్వాతంత్య్ర భావావేశంతో ఘంటసాల పాడిన పాటలు ఆనాడు ప్రజలకు ఉత్తేజపరిచాయన్నారు. తెలుగు రాష్ట్రమంతా మారుమోగాయని తెలిపారు. అగ్రనటులకు వందలాది పాటలు పాడిన ఘంటసాల.. దాదాపు ఏడు వేల పాటలకు గానం చేశారన్నారు. గానమే కాకుండా 125 సినిమాలకు సంగీత దర్శకత్వం వహించిన ఘనత ఘంటసాలకే దక్కుతుందన్నారు. గాన గంధర్వుడు అమరలోకానికి తరలినప్పటికీ ఆయన పాడిన పాటలు నేటికీ అజరామరమని కొనియాడారు. చిత్తూరులో అభిమానులు శత జయంతి ఉత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం పలువురిని ఘనంగా జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో ఘంటసాల అభిమాన సంఘం నాయకులు రవినాయుడు, కోడికిషోర్, పార్థసారథినాయుడు, రాజరత్నంరెడ్డి పాల్గొన్నారు.